యావన్మందీ మేలు కూర్చుని ఓ ఇరవై అగ్గిపుల్లలు వెలిగించి పసికూనను చూస్తూ "ఈ తొట్టిలో పుట్టలేదు కదా ఇప్పుడు! ఇక్కడ జన్మించలేదు కదా!" అంటూ నివ్వెరపోయారు.

తల్లి యంటుంది "లేదు! లేదు! ఎప్పుడూ మాతోటే ఉంటాడు వీడు! వీడు. మాదొర!"—తండ్రి అంటాడు. "మా దొరగారు హౌరానుంచి కేటాయించుకున్న స్థలం ఇది!" అంటూ ఆ ఇనుప తొట్టిమీద యమునయపు లయగా ఓ గుద్దు గుద్దాడు.

ఎక్కడున్నాడో ఆదాకా—ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ యతి సరైన్రిజుగా బండిలో వెలిసి టార్చి వేశాడు.

తల్లిదండ్రుల కిద్దఱకూ మొగాల్లో నెత్తురుచుక్క లేదు—టిక్కెట్లెక్కడ దడుగుతాడో ఆ ఉద్యోగస్థుడు అని—, కాని చంటి వాడు ఊ! ఒకటే చిరునవ్వు బండిలో ఉన్న యందరికీ సరిపడ్డ ప్యాసు తన దగ్గఱున్నట్టుగా. ఊ! ఒకటే చిరునవ్వు!

ఆశీర్వాదన్ తన మూలనుంచి "చిరాయుష్మాన్భవ!" అన్నాడు. సిపాయి చేయి తుపాకి మీటనుండి అలా దానంతటదే జారిపోయింది!

.... .... .... .... ....

## భోగరాజు అత్తింటికి

"భోగరాజు" అన్నానని మగమనిషిగా తీసుకోకండి పాఠకులు!—రాజూ యన్నా ఆడమనిషే. అందులోను పద్నాలుగు పదేనేళ్ళ పిల్ల. ప్రథమతః అత్తింటికంపుతూన్నారు "కోచ్"

బండి ఎక్కించి, ఆమెను ఆపొద్దు. " కోచ్ " యంటే రైలే, కాని " బస్సు " లా అదికూడా " హాల్టు " ల కాడ ఆగుతూ ఆటాడుతూ పోయేబండి. ఎక్కే ఉంటారు చానామంది యీపాటికి ఎప్పుడో వొకప్పుడు " కోచ్ ".

" గొట్టుపాలెం " హాల్ట్ వద్ద " కోచ్ " మరీ పల్లెటూరి వాటంగా ఆగుతుంది. ఆగి ఆలస్యం కూడా కానిస్తుంది. ఇళ్ల ముంగిళ్లు రాసుకుపోతూ ఎక్కండర్రా యన్నట్టు కూస్తుంది ; పిలపిలామంటూ పిల్లలూ, పేరంటాండ్రూ, పెత్తందార్లూ అందరూ ఆ పల్లెలోంచి యివలకు వచ్చి పరకాయిస్తూ ఉంటారు; రైలుపట్టాలంటే నిల్చివున్న బండిని, బండిలోనివాళ్ళను, పిల్చుకుంటా పోల్చుకుంటా కూడా వుంటారు.—" మా మేనత్త కొడుకడుగో :—ఒరేవ్ ! అట్నుంచి తిరిగి వచ్చేటప్పుడన్నా దిగరా !" అని ఓ అమ్మి గావుకేకేస్తే, మరో ఎమ్మెలాడి " మా ఆడపడు చదిగో, ఆడాళ్ళ బండిలో మగాడిలా కూర్చుంది" యని అరవని రోజేలేదు.

భోగరాజు సత్యవతీని ! ఆమె మొదుడో లైన్‌మాన్. మరి రెండు స్టేషన్లు ఒక హాల్టుదాటితే ఆమె అత్తిల్లే. ఆమెపేరు ఆ ప్రాంతంలో అందుచేత మరీ మ్రోగిపోయి అనాడు లైన్‌మాన్ భార్య భోగరాజురాక బాగా తెలిసిపోయింది అందరికీని.

పుట్టింటోరు బాగా వున్నవారు. పుట్టెడు భూమీ వుంది. తట్టెడు పేడా అయ్యేది. ఇష్టం వచ్చినట్టు పెంచారు భోగరాజుని. ఆ పూళ్ళోవాళ్లు అంతాకూడా భోగరాజు సత్తారింటికి పంపించడం యంటే ఆరోపనిగా పెట్టుకుని, పొలాలకెళ్ళకుండా " కోచ్ " కూత వినేదృష్టిని ఆడవాళ్ళున్ను. " కోచ్ " పొగ తిరుగుళ్ళనే

మీసాలో దేసుకునే తీవ్రతను మగవాళ్ళున్నూ. ఇనపతీగ లావల, ఇనపతీగలు దూరి, నిలబడిపోయారు.

బండిరాగానే అగ్గానే యడిగాడు గార్డు, హాల్టు మాష్టర్ని. "ఇంతమందీ ఎక్కేవాళ్ళేనా? అని. మాష్టరు "వీళ్ళంతా యెక్కితే ఊరంతా ఖాళీ. ఒక్క భోగరాజూ, భోగరాజు తల్లి ఎక్కుతారు. వాళ్ళను జాగ్రత్తగా ఎక్కించి దింపించు. భోగరాజు అంటే ఎవరో తెలుసునా?" గార్డు "తెలియకేం? లైన్ మాన్ లక్ష్మణసింగు భార్య కాదు? కొత్త పెళ్ళాం వస్తుందని ఉవ్విళ్ళూరుతూ యిప్పుడే పదిరోజులై చెప్పాడు నాతో. సారె బ్రేక్‌లో వెయ్యాలా? దగ్గఱుంచమంటారా?"

ఇలా గార్డూ మాష్టర్యూ మాట్లాడుకుంటూనే వున్నారు; భోగరాజు—తన కళ్ళంట నీళ్ళు తిరిగాయో?—చెంగున అద్దుకుంటూ బండి ఎక్కింది. బండిలోవాళ్ళు ఎఱిగున్నవాళ్ళ కూడా కొందరున్నట్టున్నారు: చోటిచ్చారు. భోగరాజు వెనకాల భోగరాజుతల్లి—కూడా ఓ మోల్మేను పెట్టి, అరిసెలకావడి, బత్తాయిపళ్ళు, పసుపుకుంకం, తాంబ్రడ, చలిమిడిముద్ద—ఒక చేమిటి, అన్నీ మనుష్యులు కూర్చునే పెట్టెలోకే పెట్టించారు—ఊరంతా తోడ్పాటయ్యారనుకోండి, ఆ సామాను ఎత్తడంలో, అందియ్యడంలో, ఆనవాళ్లు చెప్పడంలో, మఱచిపోయేరు సుమా యని అనడంలో,—

రైలు కూసింది. కదిలింది. భోగరాజు కళ్ళంట నీళ్ళల్లా కాలవ కడుతూనే వున్నాయి. ఊర్కొంక చూస్తూ.

తల్లి వూరికే "తల్లీ! ఎందుకే యేడుస్తావు? అత్తారిల్లు, అత్తింటికంపుతూ వున్నాం యని అన్నామేకాని నీకత్తలేందేనే,

ఆడపడుచు లేందేనే ? ఒక్క మొగుడూ నువ్వు చక్కని కాపురం! లైనులో గది! లైనువెనుక మంచినీళ్ళ చెరువు! ఎలావుండా లంటే యలా ఉండొచ్చు. ఎందుకే పిచ్చిదానా! ఏడుస్తావు ?" అని కళ్ళనీళ్ళు తుడుస్తూ యుండగానే తరువాతి స్టేషన్ వచ్చింది.

అక్కడెవరో ఓ యువతి బండీదిగి, భోగరాజును పరికిస్తూ " వెళ్లొస్తానో' బుల్లీ ! అదేమిటి ఆలా ఏడుస్తావు ? పునిస్త్రీదానవి ! ఏడవకమ్మా !" యని బుజ్జగించి, బండికూసి బండెళ్ళిపోయేదాకా, తనవంక అందఱూ చూచేలా—తాను భోగరాజువంక గట్టుమీద నుండి గమనిస్తూనేవుంది.

ఈమె పేరుకేం ? వేఱుపాటుగా విశదీకరింపవలసివస్తే వితంతువు, నడివయసులో ఉన్న వితంతువు. అత్తింటిపసా పుట్టింటిపసా బాగా చూచిందే—అయితేం తనివి తీఱలే! తగని మోహం, తఱుగని వొళ్లూ కళ్లూ చెక్కిళ్ళూ ఇంకా పగటుతూనే వున్నాయి.

గార్డు నవ్వుతూ ఈమెతో " భోగరాజు అత్తింటికి వెడుతూవుంది!" అన్నాడు. ఈమె " ఊఁ మతే! అదే చూస్తున్నాను." అంది.

రాత్రి పూచిన కలువలు తమ రాయడస్తమించినా ఇంకా పగలుకూడా ఆ వికాసం వికాసం ఆట్టేవుంచుకుని ఆ సొగసును ఎండలో పదిగంటల్దాకా ప్రకటిస్తూ కాపడతాయో ఆలా ప్రకటించింది కుసింత చిర్నవ్వు " ఊఁ మతే యదే చూస్తున్నాను " అంటూ ఈమె.

భోగరాజు బండిలోంచి చిరునవ్వు నవ్వింది " అత్తా! వెళ్లొస్తా " నంటూ,

"అవితే భోగరాజు నీకోడలా ?" అన్నాడు స్టేషన్ మాస్టర్. "కాదండీ ! నాకు బిడ్డల్లేరు. ఇవన్నీ మాయవరసలు" అంటూ టిక్కెట్టందిచ్చింది ఈమె నవ్వుతూ. భోగరాజు బండి లోంచి తొంగిచూస్తూ "అత్తా ! మఱచిపోకేం" యంటూ మరో సారి మఱపించే చిరునవ్వు లోలో నవ్వుకుంది.

అంతలో అసలు హాల్టు వచ్చిందింక. రైలాదింపేదు భోగరాజుకు లైన్‌మాన్ స్వాగతమిస్తూ.

గార్డు "నీ పెళ్ళామా ?" అన్నాడు. భోగరాజుకు నవ్వొచ్చింది. "అలా యడుగుతాదేమిటి అన్నీ ఎఱిగివున్న గార్డే మళ్ళా" అని తల్లి వెనక నిలబడి పూరానవ్వు నవ్వింది.

తల్లి "నవ్వకే మాఅమ్మా ! వెళ్లేది అత్తింటికి !" యని అనేదాకా ఒకేనవ్వు నవ్వింది !

.... .... .... .... ....

## పంట్, పండు్, కాయ్, కసవు....

రయితిలా ఉంటాడని వర్ణించ నక్కరలేదు. తోటిలా ఉంటుందని వివరించ నక్కఱలేదు. ఎంచేతా యంటే హిందూదేశంలో ముప్పాతిక మువ్వీసపు జనం వ్యవసాయదార్లే. హిందూదేశంలో సగభాగపు భూమి సాగుబడి సుక్షేత్ర ఖండికలే. అందులోనూ ఒక్కొక్క తోటన్నది వుందా యంటే ఎకరం మూడువేలు నాలుగువేలు కూడా ఖరీదు చేస్తుంది. రయితంటూ ఉన్నాడా యంటే అతడూ యతని భార్యాకూడా తరతరాలుగా అమరకానికి పుచ్చుకుని యదే రాబట్టడం—పంట, పండు, కాయ, కసవు....